క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 33/11 కేవీ షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ షీలానగర్ ఫీడర్, 11 కేవీ పోర్టు రోడ్డు ఫీడర్, 11 కేవీ జగ్గయ్యపాలెం ఫీడర్, 11 కేవీ వెంకటేశ్వరకాలనీ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం, గవరజగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ, పోర్టు రోడ్డు ఏరియా, కిమ్స్ ఐకాన్ హాస్పటల్ ఏరియా, కుప్పీ లేవుట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



తిరుప్పావై నిర్వహిస్తున్న అర్చకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తిరుప్పావై ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తెల్లవారు జాము నుంచి ఈ కార్యక్రమం జరిపించారు. 9వ పాశురం భక్తులకు చదివి వినిపించారు. అనంతరం భక్తులు ఆలయానికి అందించిన ఇత్తడి గరుడ వాహనానికి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సాహిబ్‌నాయుడు, ఉమామహేశ్వరరావు, వెంకటరావు, సత్యనారాయణ, కృష్ణారావు పాల్గొన్నారు.

వసతి గృహంలో యువతికి ఆశ్రయం



ఏయూటీడీ వసతి గృహానికి యువతిని అప్పగిస్తున్న న్యూపోర్ట్ పోలీసులు

పెదగంట్యాడ/సీతమ్మధార: రోడ్డు మీద ఒంటరిగా తిరుగుతున్న ఒక యువతిని జీవీఎంసీ వసతి గృహానికి తరలించారు. ఏయూటీడీ సంస్థ ప్రతినిధి తెలిపిన వివరాలిలా.. పెదగంట్యాడ న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది గుర్తు తెలియని ఒక యువతిని బుధవారం ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ–ఏయూటీడీ మహిళా షెల్టర్ హోమ్‌కు తీసుకొచ్చారు. ఈ అమ్మాయి గాజువాక సమతానగర్ కాలనీలో ఒంటరిగా తిరుగుతుంటే స్థానికులు 112కు కాల్ చేసి సమాచారమిచ్చారు. న్యూపోర్ట్ సీఐ కామేశ్వరరావు ఆదేశాలతో హెడ్‌కానిస్టేబుల్ కన్నారావు ఆ యువతిని షెల్టర్‌కు తీసుకొచ్చి నిర్వాహకులకు అప్పగించారు. ఆమె తన పేరు, ఊరూ ఏమీ చెప్పడం లేదు. మానసిక రోగి కావడంతో వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. వెంటనే శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా ఈ యువతికి చికిత్స ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న రాముడు, లక్ష్మి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని దుర్గాలమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి దాతలు సహాయ సహకారాలు అందజేస్తున్నారు. బుధవారం అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి అక్కిరెడ్డిపాలెంకు చెందిన పసుపులేటి రాముడు, లక్ష్మి దంపతులు రూ.35,116 ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

బాదుడే.. బాదుడు



ఎన్నికల సమయంలో..

ప్రజలపై భారం మోపం.. సంపద సృష్టిస్తాం.. అని కూటమి నాయకులు హామీల వర్షం కురిపించారు. ఒక పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తాం.. మరో పక్క అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం అని ఊరూవాడా వాగ్దానాలు చేశారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత..

అంతా రివర్స్ గేర్‌లో పాలన సాగిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలును మరిచి పోయారు. సూపర్ సిక్స్‌ను అటకెక్కించారు. నూతన సంవత్సరం నుంచి మరో బాదుడుకు సిద్ధమయ్యారు. భూములు, భవనాల విలువ పెంచి రిజిస్ట్రేషన్ చార్జీల మోత మోగించడానికి సన్నద్ధమయ్యారు.

పెదగంట్యాడ: అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం అలవాటుగా మార్చుకున్న చంద్రబాబు ఎప్పటిలాగే తన బుద్ధి చూపిస్తున్నారు. మరో నాలుగున్నరేళ్ల వరకూ అడిగే వాడు లేకపోవడంతో ఇష్టానుసారంగా పాలన సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొత్త సంవత్సరం నుంచి భూమి ధరలను పెంచేందుకు రంగం సిద్ధం చేసింది. రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు ప్రాంతాల వారీగా ఎంతంత పెంచాలో నివేదికలు సిద్ధం చేశారు. అయితే దీనిపై ప్రజలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని.. ధరలు పెరిగితే మరింత పడిపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్లు.. భవనాల్లో ఇలా..

అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువ రూ.1,400 నుంచి రూ.1490 అలాగే కార్ పార్కింగ్ రూ.900 నుంచి 960 వరకు పెరగనుంది. సిమెంటు రేకుల ఇళ్లకు సంబంధించి చదరపు అడుగు గతంలో రూ.700 ఉండగా ఇప్పుడు దానిని రూ.740కు పెంచారు. ప్రాంతాల వారీగా స్థలం విలువలను బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వ్యాపారం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

1 నుంచి కొత్త ధరలు

కొత్త సంవత్సరం జనవరి 1 నుంచి పెంచిన ధరలను అమలు చేయనున్నారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో గాజువాక, పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూములు, ఇళ్లు ఇతర ఆస్తుల విలువలు అమాంతంగా పెంచేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే భూముల విలువ ఎక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 15 శాతం వరకు పెంచాలని, భూముల విలువ తక్కువగా ఉందనుకునే ప్రాంతాల్లో 10 శాతం వరకు పెంచాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది.ఈ మేరకు పెంపుపై రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు కసరత్తు చేశారు.ఎక్కడ ఏ విధంగా భూముల విలువను పెంచాలనే దానిపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. కొత్త నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్న భూముల విలువలను 10 శాతం,ఎక్కువగా ఉన్న భూముల విలువను 15 శాతం వరకు పెంచనున్నారు.

కొత్త ధరల ప్రకారం రిజిస్ట్రేషన్లు

వచ్చే ఏడాది ఒకటో తేదీ నుంచి కొత్త ధరల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయనున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెరిగిన ధరల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నాం. భూములు, ఇళ్లు కొనుగోలుదారులు, అమ్మకందారులు గమనించాలి. పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

–ఎం.ఎల్.కిశోర్,
ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, పెదగంట్యాడ

వ్యాపారాలు చేయలేం



నేను కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాను. ప్రస్తుతం వ్యాపారం అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పుడు భూమి ధరలు పెంచితే వ్యాపారం మరింత పడిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి. ప్రభుత్వం ధరల పెంచే యోచన విరమించుకోవాలి.

– చెల్లుబోయిన నాయుడు,
చైర్మన్, శ్రీ సీబీఎస్ ఇన్‌ఫ్రా

పండగనాడూ పస్తులేనా...



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అగనంపూడి: ఆంక్షల పేరుతో విశాఖ ఉక్కు కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో 1413వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతూ సాధారణ పరిస్థితులు నెలకొంటున్నా కార్మికులు, ఉద్యోగుల జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంతో యాజమాన్యం కలిసి కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. ఇందులో భాగంగా కార్మికులకు జీతాలు చెల్లించకుండా స్వచ్ఛందంగా ఉద్యోగం నుంచి తప్పుకొనే పరిస్థితులు కల్పిస్తుందని ఆరోపించారు. వినాయక చవితి, దీపావళి, క్రిస్మస్ వంటి ముఖ్యమైన పండగల నాడు జీతాలు చెల్లించకుండా క్షోభపెడుతున్న యాజమాన్యం భవిష్యత్‌లో తగినమూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి కలుగజేసుకొని ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించి, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. బీఎంఎల్‌నాయుడు, కొణతాల శ్రీను, ఎస్ఎస్ఎన్‌మూర్తి, పి.అప్పారావు, సాయిరామ్, బాబూరావు, మరియదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేతనాల కోసం ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో గురువారం స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు మూడు నెలలుగా సక్రమంగా జీతాలు చెల్లించకపోవడానికి నిరసనగా ఉదయం 7.45 నుంచి 8.45 వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన వ్యక్తం చేయనున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ధర్నాకు హాజరుకావాలని స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, వై.టి. దాస్, యు. రామస్వామి కోరారు.

ప్రేమ, శాంతి, కరుణకు చిహ్నం క్రిస్మస్

- ప్రభు నామస్మరణతో పులకించిన గాజువాక
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు

గాజువాక: క్రిస్మస్ పర్వదినాన గాజువాకలోని చర్చిలు ప్రార్థనలతో మార్మోగాయి. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకను ఆనందోత్సాహాల నడుమ బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ పఠనం చేశారు. ప్రార్థన మందిరాల్లో క్రీస్తు జన్మించిన పశువుల పాక (క్రిబ్)లను, క్రిస్మస్ చెట్లును నెలకొల్పారు. భక్తి శ్రద్ధలతో ప్రభువును స్మరించుకొని కొవ్వొత్తులు వెలిగించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బీసీ రోడ్‌లోని యునైటెడ్ బాప్టిస్ట్ చర్చి, పాతగాజువాకలోని రోమన్ కేథలిక్ చర్చి, శ్రీనగర్‌లోని మన్నా, సీఎస్ఐ చర్చిలు, బీసీరోడ్డు రైతుబజార్ సమీపంలోని బాప్టిస్ట్, యుసీఎం, వుడారోడ్డులోని యహోవా షమ్మా, సియోను ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. పలు చర్చిల్లో వివిధ సేవా కార్యక్రమాలునిర్వహించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. యూబీ చర్చిలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు.



యూబీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



పాతగాజువాకలోని రోమన్ కేథలిక్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



69వ వార్డు రాంనగర్‌లోని యునైటెడ్ చర్చిలో ప్రార్థనలు



హరిజనజగ్గయ్యపాలెంలో సియోన్ ప్రార్థన మందిరంలో చిన్నారులు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పెదగంట్యాడ: క్రీస్తు బోధనలు అనుసరణీయమని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం రోడ్డులోని సియోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు కేత పీటర్ (అప్పారావు),కేత సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను నాగిరెడ్డి కేక్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు ప్రకాష్, ఎజ్రా,దైవ సేవకురాలు కేత రమణమ్మ, పాల్గొన్నారు.

- వినాయకనగర్ వుడా కాలనీలో లివింగ్ క్రైస్ట్ చర్చిలో పాస్టర్లు కె.శాంసన్, ఆరోన్‌జాన్ సుజిత్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 72 వ వార్డు అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

అగనంపూడి: ప్రేమ, శాంతి, కరుణ, దయా గుణాలకు చిహ్నంగా క్రిస్మస్ నిలుస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పినమడకలోని కల్వరి ప్రార్థన మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు సూచించిన మార్గంలో పయనిస్తే అన్యాయాలు, మోసాలు ఉండవని, ప్రేమానురాగాలతో సమాజం సన్మార్గంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్ మోహన్‌రాజు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు.

- 87వ వార్డు వడ్లపూడిలోని హోలీ ఫ్యామిలీ చర్చి ఆవరణలో ఫాదర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పార్థనలు



షీలానగర్ హయ్యర్ లూథరన్ మెమోరియల్ చర్చిలో..



చర్చి ఫాదర్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న గోవింద్

చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ఆడారి శ్రీను పాల్గొన్నారు.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: ఉక్కునగరంలో బుధవారం క్రిస్మస్ పండగను వైభవంగా జరుపుకున్నారు. స్థానిక రూపాంతర లూథరన్ దేవాలయంలో పాస్టర్లు రెవరండ్ ఎం. దొరైరాజు, అసిస్టెంట్ పాస్టర్ రెవరండ్ ఎం. ఇమాన్యుయల్ సువర్ణరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరండ్ డాక్టర్ ఎం. జోసఫ్ కిషోర్ స్పీకర్‌గా పాల్గొన్నారు. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన ఈ వేడుకల్లో యువత,పిల్లలు పలు స్కిట్లను ప్రదర్శించారు. చర్చి కమిటీ చైర్మన్ కె.ఎస్. డేవిడ్ రాజు, కోశాధికారి ఎన్. సురేష్‌పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న దైవ సేవకులు

- సెక్టార్–8, క్రైస్ట్ ది సేవియర్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో చర్చి ఫాదర్లు షాజీ, ప్రవీణ్, క్రిస్టీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు పుట్టుక, క్రిస్మస్ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా పిల్లలు గేయాలు ఆలపించారు.
- సెక్టార్–12లోని ది అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రీస్తు ఆరాధన గురించి వివరించారు.
- హొసన్నా లవ్ అండ్ విజన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. వృద్ధులకు, పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు.

స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఆర్.ఎ. నాయుడు, కె.ఎస్.ఎన్. రాజు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు



సియోను ప్రార్థన మందిరంలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



క్రీస్తు బోధనలు చేస్తున్న పాస్టర్ కేత పీటర్



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ ఆరోన్ జాన్, శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లోని యునైటెడ్ ఇమాన్యుయేల్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో ముఖ్య అతిథులుగా పీజేభాస్కరరావు, జి.ఎఫ్.లివింగ్‌స్టన్, ఎస్.రోజ్ ఎవిలిస్ రాయ్ పాల్గొన్నారు. 69వ వార్డు హరిజనజగ్గయ్యపాలెంలో చిన్నారులు ప్రార్థనలు, షీలానగర్ హయ్యర్ మెమోరియల్ చర్చిలో క్రీస్తు సహోదరులు ప్రార్థనలు నిర్వహించారు.



స్టీల్‌ప్లాంట్ క్రైస్ట్ ది సేవియర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్‌లు

వాజ్‌పేయికి బీజేపీ నాయకుల నివాళి

గాజువాక: భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి గాజువాక బీజేపీ నాయకులు బుధవారం నివాళులర్పించారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన పాలన స్ఫూర్తిగా ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, సిరసపల్లి నూకరాజు, శశిధరణ్ , శంకరరావు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బాలచెరువులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి వేడుకలను బీజేపీ వార్డు అధ్యక్షుడు జిలకర్ర రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిలకర్ర భువనేశ్వరి, వనుము పెంటయ్య, లక్ష్మణ్, ప్రసాద్, సన్యాసమ్మ పాల్గొన్నారు.

మైదానం.. బురదమయం



బురదమయంగా మారిన అక్కిరెడ్డిపాలెం మైదానం

అక్కిరెడ్డిపాలెం: చిన్నపాటి వర్షం పడితే చాలు 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా గల మైదానం బురదమయంగా మారుతుంది. ప్రైవేటు వాహనాల పార్కింగ్‌తో మైదానం మరింత అధ్వానంగా తయారవుతోంది. దీంతో పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి ఇబ్బందులు తప్పవు. ఎన్నికల ముందు వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష మైదానం ప్రక్షాళనకు ప్రతిపాదనలు చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో అంశం కాస్తా మరుగున పడిపోయింది. వెంటనే జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి నిధులు విడుదల చేయాలని పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.